ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

భద్రాద్రి కొత్తగూడెం

BHADRADRI KOTHAGUDEM

బుధవారం, 10 ఏప్రిల్ 2024

5



మంగళవారం ఉష్ణోగ్రత

	కనిష్ఠం	గరిష్ఠం
ఖమ్మం	24	38
భద్రాద్రి	24	40



రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6:29 (బుధవారం)

- ఘనంగా శ్రీ క్రోధి నామ సంవత్సర వేడుకలు
- ఇరుజిల్లాల్లో ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- పలుచోట్ల పంచాగ శ్రవణాలు
- బంధుమిత్రులతో సందడిగా లోగిళ్లు
- మధిరలో వేడుకల్లో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క
- గండుగులపల్లిలో వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పూజలు

తెలుగింట ఉగాది శోభ



ఖమ్మం గుట్ట నృసింహస్వామి దేవాలయంలో బారులుతీరిన భక్తులు

ఖమ్మం ఖానాపురంహవేలి/కొత్తగూడెం సాంస్కృతికం, ఏప్రిల్ 9: తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని మంగళవారం ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఉగాది సందర్భంగా మామిడి తోరణాలు, అరటి ఆకులతో తమ ఇళ్లను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని స్వీకరించి ఇంటిల్లిపాది ఆత్మీయ అనుబంధాలు పంచుకున్నారు. ఆలయాల్లో జరిగిన ప్రత్యేక పూజల్లో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. మధిరలో జరిగిన ఉత్సవాలలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పాల్గొన్నారు. భద్రాద్రి జిల్లా గండుగులపల్లిలోని తన స్వగృహంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉగాది వేడుకల్లో పాల్గొన్నారు. ఖమ్మం నగరంలోని గుంటు మల్లేశ్వరస్వామి ఆలయంలో కలెక్టర్ వీపీ గౌతమ్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరంలోని స్తంభాద్రి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లాలోని పలు ఆలయాల్లో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు ఆలయాల్లో పండితులు పంచాగ శ్రవణం నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ శ్రీ క్రోధి నామ ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గృహస్తులు తమ ఇళ్లను మామిడి తోరణాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంతో పాటు మైన్స్ డిపార్టుమెంట్ల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. హెడ్డాఫీస్‌లో నిర్వహించిన పూజా కార్యక్రమంలో డైరెక్టర్ డి. సత్యనారాయణ పాల్గొన్నారు.



భక్తులతో కిక్కిరిసిన గణేష్‌టెంపుల్



తుమ్మల దంపతులను ఆశీర్వదిస్తున్న అర్చకులు

తుమ్మల నివాసంలో ఉగాది వేడుకలు

దమ్మపేట/భద్రాచలం, ఏప్రిల్ 9: శ్రీ క్రోధినామ సంవత్సరం ఉగాది సందర్భంగా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నివాసం భద్రాద్రి జిల్లా గండుగులపల్లిలో మంగళవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మల కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉగాది సందర్భంగా భద్రాచలం విశ్రాంత ప్రధాన అర్చకుడు పొడిచేటి జగన్నాధాచార్యులు తుమ్మల దంపతులకు వేద ఆశీర్వచనం అందజేశారు. పంచాంగపఠనం చేశారు.

మధిరలో డిప్యూటీ సీఎం భట్టి ఉగాది పూజ



పూజ చేస్తున్న భట్టి విక్రమార్క

మధిరటౌన్, ఏప్రిల్ 9: ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మంగళవారం ఖమ్మం జిల్లా మధిరలోని తన క్యాంపు కార్యాలయంలో ఉగాది సంబరాల్లో పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా మధిరలో ఉగాది పండుగను జరుపుకునే భట్టి ఈ సంవత్సరం కూడా తన సతీమణి నందినితో కలిసి మధిరలోని తన కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం క్యాంపు కార్యాలయానికి వచ్చిన అందరికి తీర్థప్రసాదాలు అందచేశారు. ప్రజలందరికీ క్రోధినామ సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన భట్టి కొత్త ఏడాదిలో సమృద్ధిగా వర్షాలు కురిసి పుష్కలంగా పంటలు పండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని భట్టి కోరుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నేతలు భట్టి విక్రమార్కకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.



గుంటుమల్లేశ్వరస్వామి ఆలయంలో ఖమ్మం కలెక్టర్ గౌతమ్ దంపతులు..



భూగర్భజలాలు అడుగంటడంతో నిరుపయోగంగా బోరు

చి'వరి' కష్టాలు



- పూర్తిగా అడుగంటిన భూగర్భ జలాలు
- పంట పక్వానికి వచ్చే దశలో తీవ్ర నీటి ఎద్దడి
- తల్లాడ మండలంలో ఎండిపోతున్న 1,485ఎకరాల వరి
- పంటలను కాపాడుకునేందుకు రైతుల భగీరథ యత్నాలు

తల్లాడ, ఏప్రిల్ 9: అష్టకష్టాలకోర్చి ఎన్నో వ్యయప్రయాలతో సాగు చేసిన పంట చేతికొచ్చే దశలో నీరులేక ఎండిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగునీరు లేకపోవడంతో యాసంగి వరిపొలాలు నెర్రెలు బారి ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. యాసంగి సీజన్‌లో తల్లాడ మండలంలో 1,485ఎకరాల్లో వరిసాగు చేశారు. చెరువులు, కుంటలు, వాగులు, బోర్లు, వ్యవసాయ విద్యుత్ మోటార్ల కింద సాగు చేసిన రైతులు అత్యధిక విస్తీర్ణంలో 1,061అనే రకం విత్తనాన్ని సాగుచేశారు. వరిసాగు కోసం ఎకరాకు రూ.25వేలకుపైగా పెట్టుబడులు పెట్టారు. ప్రస్తుతం వరి ఈని గింజ పాలు పోసుకునే దశలో ఉంది. ఈ తరుణంలో వరికి పుష్కలంగా సాగునీరందిస్తే గింజ గట్టిపడి పంట చేతికొస్తుంది. ఈ సమయంలో నీటి ఎద్దడి ఏర్పడితే గింజలు తాలుగా మారే ప్రమాదం ఉంటుంది. వర్షాభావం, ఎండల తీవ్రత వల్ల చెరువులు, కుంటలు, వాగులు, బోర్లలోని భూగర్భజలాలు అడుగంటిపోవడంతో మండలంలోని కుర్నవల్లి పరిసర గ్రామాల్లో కొన్నిచోట్ల వ్యవసాయ విద్యుత్ మోటార్లు నిరుపయోగంగా మారాయి. పంట చేతికొచ్చే దశలో ఎండిపోతున్న వరిపైర్లను కాపాడుకొనేందుకు రైతులు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. కిలోమీటర్‌కు పైగా పైపులు వేసి సాగునీటిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు. వ్యవసాయానికి త్రీఫేస్ విద్యుత్ సరఫరా అర్ధరాత్రి 12గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు చేస్తుండడడంతో తరుచూ ట్రిప్పు అవుతూ విద్యుత్ సరఫరాకు అంతరాయంతో రైతులు సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంతోపాటు సాగర్‌జలాలు విడుదల చేసి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.



సేవ్ చేయమంటే షేర్ చేశాడు..

- విద్యార్థుల సొమ్ముకాజేసిన బ్యాంక్ మేనేజర్
- తన స్నేహితులు, బంధువుల ఖాతాల్లోకి రూ.2.40కోట్లు బదిలీ
- ఖమ్మం సీపీ సునీల్‌దత్‌ను ఆశ్రయించిన బాధితులు
- వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు

ఖమ్మం క్రైం, ఏప్రిల్ 9: విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులకు మంజూరైన రుణాలను ఓ బ్యాంక్ మేనేజర్ దుర్వినియోగం చేసిన ఘటనపై ఖమ్మం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం రాత్రి కేసునమోదైంది. వైరా రోడ్‌లోని జడ్పీసెంటర్ సమీపంలోని ఉన్న ఇండస్‌ఇండ్ బ్యాంకులో పలువురు విద్యార్థులు ఫీజులు చెల్లించేందుకు తమ ఖాతాల్లో కొంత నగదును ఉంచారు. అయితే ఈ నగదును సదరు బ్యాంకు మేనేజర్ ఖాతాదారులకు తెలియకుండా తన బంధువులు, స్నేహితుల ఖాతాల్లోకి బదిలీచేశాడు. ఈ ఘటనపై బాధితులు సోమవారం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌కు ఫిర్యాదు చేయగా సీపీ ఆదేశాలమేరకు వన్‌టౌన్ పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు సుమారు 25మంది మోసపోయినట్లు గుర్తించారు. అదేవిధంగా మోసపోయిన వారిలో బ్యాంకు సిబ్బందితోపాటు ఇతర బ్యాంకుల సిబ్బంది కూడా ఉన్నట్లు తెలిసింది. వీరంతా సుమారు రూ.2.40 కోట్లు మోసపోయినట్లు పోలీసుల విచారణలో తేలింది.





అన్నలపై ముప్పేట దాడి

- దండకారణ్యంలోకి ఐదు రాష్ట్రాల బలగాలు
- నెల రోజుల్లో ఐదు ఎన్‌కౌంటర్లు
- 26 మంది మావోయిస్టులు మృతి
- అడవుల్లో ఆందోళనలో ఆదివాసీలు

7

హస్తంలో అదే సందిగ్ధం



- ఖమ్మం కాంగ్రెస్ సీటుపై ఎటూ తేల్చని అధిష్టానం
- ఏకాభిప్రాయానికి రాలేకపోతున్న జిల్లా నేతలు
- మరింత ఆలస్యం కానున్న అభ్యర్థి ప్రకటన
- తాజాగా ప్రచారంలోకి మాజీ మంత్రి మండవ

7

పాపం..పసివాళ్లు



- చిన్న ఎండ తగిలినా... బలమైన గాలివీచినా ఓర్చుకోలేరు
- పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ఉక్కిరిబిక్కిరవుతున్న చిన్నారులు
- ఎండలు తగ్గేంత వరకు సెలవులు ఇవ్వాలని వినతి
- పౌష్టికాహారం ఇంటికే అందించాలని తల్లిదండ్రుల వేడుకోలు

6



మృత్సంగ్రహణం సమయంలో పూజలు నిర్వహిస్తున్న వైదిక సిబ్బంది



పుట్టమన్ను సేకరణ..



దీక్షా వస్త్రాలను అందజేస్తున్న ఈవో దంపతులు

రామయ్య కళ్యాణానికి అంకురార్పణ

ఉత్సవాంగ స్నపనంతో తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

- భద్రాద్రిలో సంప్రదాయబద్ధంగా మృత్సంగ్రహణం
- నిత్యకల్యాణ మండపంలో ఉగాది పంచాంగ శ్రవణం
- రామయ్య ఆదాయం 14, వ్యయం 2
- సీతమ్మవారి ఆదాయం 5, వ్యయం 5

భద్రాచలం, ఏప్రిల్ 9: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో మంగళవారం ఉత్సవాంగ స్నపనంతో వసంతపక్ష ప్రయుక్త శ్రీరామనవమి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ముందుగా శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకొని తెల్లవారుజామున 4 గంటలకు సుప్రభాతసేవ నిర్వహించారు. అనంతరం స్వామివారికి ఆరాధన, ఉగాది ప్రసాద నివేదన చేశారు. బ్రహ్మోత్సవాల్లో పాల్గొనే రుత్వికులకు, సిబ్బందికి భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి దంపతులు దీక్ష వస్త్రాలను అందజేశారు. అలాగే మూలవరులకు అభిషేకం, బేడా మండపంలో ఉత్సవమూర్తులకు ఉత్సవాంగస్నపనంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. సాయంత్రం గోవిందరాజస్వామి ఆలయం(తాతగుడి)కు శ్రీ సీతారామచంద్రస్వామి ఉత్సవమూర్తులను తీసుకెళ్లి సంప్రదాయబద్ధంగా మృత్సంగ్రహణం నిర్వహించారు. భూవరాహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మట్టిని సేకరించి కల్యాణ అంకురార్పణకు వినియోగించారు. తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు ప్రారంభం కావడంతో మంగళవారం నుంచి 23వ తేదీ వరకు నిత్యకల్యాణాలకు విరామమిచ్చారు. అలాగే నేటి నుంచి మే ఒకటి వరకు పవళింపు సేవలు, 23వరకు దర్బారు సేవలు నిలిపివేశారు. ఉగాదిని పురస్కరించుకొని రాత్రి శ్రీ సీతారామచంద్రస్వామికి కల్పవృక్ష వాహనసేవ నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి దంపతులు, ఏఈవో భవానీరామకృష్ణారావు, పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, అమరవాది విజయరాఘవన్ వైదిక పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.

పెరగనున్న రామయ్య ఆదాయం

శ్రీ క్రోధి నామ సంవత్సరంలో భద్రాద్రి రామయ్య ఆదాయం పెరగనుందని వ్యయం తగ్గే అవకాశాలున్నాయని స్థానాచార్యులు కేఈ స్థలశాయి తెలిపారు. భద్రాచలంలో మంగళవారం రాత్రి శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకొని నిత్యకల్యాణ మండపం వద్ద పంచాంగ శ్రవణం చేశారు. భద్రాద్రి రామయ్య ఆదాయం 14, వ్యయం 2 ఉంది. రాజపూజ్యం-అవమానం 6-6గా ఉందని, సీతమ్మ వారికి ఆదాయం 5- వ్యయం- 5, రాజపూజ్యం - 5, అవమానం - 2గా ఉంటుందన్నారు. ఈ సారి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు కనిపిస్తున్నాయన్నారు. ధాన్యాదుల కంటే పుష్పాల పంట అధికంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఏడాది ప్రజలు పరస్పర వైరంను విడిచిపెట్టి అన్యోన్యంగా జీవనం సాగిస్తారని పేర్కొన్నారు. ఈ సంవత్సరం ఎటువంటి గ్రహణాలు లేవని తెలిపారు. క్రోధి నామ సంవత్సరంలో ప్రత్యేకత నర్మదానది పుష్కరాలున్నాయని 12 రోజుల పాటు ఇవి కొనసాగుతాయని పేర్కొన్నారు.



పుట్టమన్నుపై భూ వరాహస్వామి చిత్రం

కల్యాణం నిర్వహించే వైదిక బృందం ఇదే..



7

రాజకీయాలకు తొలి మెట్టు విద్యార్థి సంఘాలే

- ఘనంగా ఎన్‌ఎస్‌యూఐ 54వ ఆవిర్భావ వేడుకలు
- జిల్లా కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్


ఎన్‌ఎస్‌యూఐ కేక్ కట్ చేస్తున్న తుమ్మల యుగంధర్

ఖమ్మం సంక్షేమవిభాగం, ఏప్రిల్ 9: రాజకీయాలకు తొలి మెట్టు విద్యార్థి, యువజన సంఘాలే అని జిల్లా కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్ పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మంలోని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఎన్‌ఎస్‌యూఐ 54వ ఆవిర్భావ వేడుకల్లో ఆయన పాల్గొని కేక్ కట్ చేసి ప్రసంగించారు. విద్యార్థులకు ప్రజా సమస్యలపై అవగాహన పెరగాలని, భవిష్యత్ రాజకీయాల్లో యువతను ప్రోత్సహించేందుకు 1971లో అప్పటి ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ ఎన్‌ఎస్‌యూఐను నిర్మాణం చేశారన్నారు. జిల్లా నుంచి జాతీయ స్థాయి వరకు ఎన్‌ఎస్‌యూఐలో ప్రజాస్వామ్యయుతంగా నాయకుల ఎన్నికల విధానం అమలులో ఆదర్శంగా కొనసాగుతుందన్నారు. జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు యడ్లపల్లి సంతోష్, కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులునాయక్, రాపర్తి శరత్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి బీజేపీ ప్రభుత్వం విశేష కృషి

● ఖమ్మం బీజేపీ లోక్‌సభ అభ్యర్థి తాండ్ర వినోదరావు

ఏన్కూరు, ఏప్రిల్ 9: క్రీడాభివృద్ధికి బీజేపీ ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని ఖమ్మం బీజేపీ లోక్‌సభ అభ్యర్థి తాండ్ర వినోదరావు అన్నారు. ఉగాది పండుగ సందర్భంగా తిమ్మరావుపేట గ్రామంలో జరుగుతున్న మూడురోజుల క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి మంగళవారం హాజరై మాట్లాడారు. ఫైనల్స్‌కు చేరుకున్న క్రీడాకారులను పరిచయం చేసుకుని ప్రసంగించారు. భవిష్యత్తులో జిల్లా రాష్ట్రస్థాయి క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జాతీయ అథ్లెట్ క్రీడాకారుడు వినయ్‌రావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్‌రాథోడ్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చావా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులకు బహుమతులు అందిస్తున్న వినోదరావు

పాపం..పసివాళ్లు

పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో చిన్నారులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. దీంతో ఎండాకాలంలో పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించేందుకు తల్లిదండ్రులు వెనుకంజ వేస్తున్నారు. ఇవన్నీ కష్టాలు దాటుకుని చిన్నారులు కేంద్రాలకు చేరుకుంటే.. అక్కడ సమస్యలు వారిని సతమతం చేస్తున్నాయి. ఉదయం 10గంటలకే భానుడు భగభగమంటుండడంతో చిన్నారులు బయటకు రాలేకపోతున్నారు. చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఎండలు తగ్గే వరకు వేసవి సెలవులు మంజూరు చేసి, ఇంటికే పౌష్టికాహారం అందించాలని కోరుతున్నారు.

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ఉక్కిరిబిక్కిరవుతున్న చిన్నారులు
- అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతులు లేక ఇబ్బందులు
- ఎండలు తగ్గేంత వరకు సెలవులు ఇవ్వాలని వినతి
- పౌష్టికాహారం ఇంటికే అందించాలని తల్లిదండ్రుల వేడుకోలు

ఖమ్మం ఖానాపురంహవేలి ఏప్రిల్ 9: పాపం పసివాళ్లు... చిన్న ఎండ తగిలినా, బలమైన గాలివీచినా ఓర్చుకోలేరు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో చిన్నారులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఎండాకాలంలో పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించేందుకు తల్లిదండ్రులు వెనుకంజ వేస్తున్నారు. ఇవన్నీ కష్టాలు దాటుకుని చిన్నారులు కేంద్రాలకు చేరుకుంటే.. అక్కడ సమస్యలు వారిని సతమతం చేస్తున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫ్యాన్లు లేక ఉక్కపోతకు పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెలుతురు కూడా సరిగా లేక చీకటి గదుల్లోనే అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఉదయం 10 గంటలకే భానుడు భగభగమంటుండడంతో చిన్నారులు బయటకు రాలేకపోతున్నారు. మూడు నుంచి నాలుగేళ్ల చిన్నారులపై ఎండ ప్రభావం తీవ్రంగా పడుతోంది. ఎండల కారణంగా అంగన్‌వాడీ టీచర్లు కూడా ఉక్కపోత భరించలేక పోతున్నారు.

వసతులు లేక ఇబ్బందులు

జిల్లాలో 1,840 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, 958 కేంద్రాలు సొంత భవనాల్లో కొనసాగుతున్నాయి. 454 కేంద్రాలు అద్దె భవనాల్లోనే నెట్టుకొస్తున్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పరిధిలోని భవనాల్లో 428 కేంద్రాలు కొనసాగుతున్నాయి. మొత్తం ఏడు ప్రాజెక్టుల పరిధిలో 7 నెలల చిన్నారులు 37,912మంది, మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు 19,747 మంది చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్నారు. సొంత భవనాల్లో విద్యుత్ కనెక్షన్, ఫ్యాన్లు, తాగు నీటి సౌకర్యాలు ఉన్న దాఖలాలు లేవు. అలాగే కేంద్రాల్లో మరుగుదొడ్లు కూడా కనిపించడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు కనీసం బాత్‌రూం సౌకర్యం కూడా లేకపోవడంతో నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంటి నుంచి కేంద్రానికి వచ్చిన వారు మళ్లీ ఇంటికి నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తుంది. పిల్లల ఆలనాపాలన చూస్తున్న అంగన్‌వాడీ టీచర్లు కూడా మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని ఎవరికి చెప్పుకోలేక తెలియక నానా అవస్థలు పడుతున్నారు అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను ఇటీవల జరిగిన జడ్పీ సమావేశంలో సభ్యులు ప్రస్తావించినా నేటికి పట్టించుకోని అధికారులు. కేంద్రాల్లో వసతులు కొరవడటంతో చిన్నారుల పరిస్థితి అధ్వానంగా మారింది.


ఇండస్ట్రీయల్ ఏరియాలోని అంగన్‌వాడీ కేంద్రం

అద్దె భవనాల్లో చిన్నారుల అవస్థలు

మహిళా, స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సమగ్ర శిశు అభివృద్ధి పథకం (ఐసీడీఎస్) ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు ఏటా ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుంది. అయినా అద్దె భవనాలు, ఇరుకు గదుల్లోనూ టీచర్లు, చిన్నారులు, ఇబ్బందులు పడుతున్నారు. నిధుల కొరత కారణంగా పలు అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు మంజూరు కావడం లేదు. తక్కువ అద్దె ఇస్తుండటంతో ఇరుకు గదుల్లో ఇబ్బంది పడాల్సి వస్తుంది. ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో ఒక్కో కేంద్రానికి నెలకు రూ.6,000 చొప్పున అద్దె చెల్లిస్తోంది.

అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం స్థలాలను గుర్తించారు. కానీ.. ఇప్పటివరకు ఒక్క భవన నిర్మాణానికీ నిధులు మంజూరు కాలేదని తెలుస్తోంది.

వేసవి సెలవులు ఇవ్వాలి

రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరిగి పోతున్నాయి. 42 డిగ్రీలకు తక్కువ కాకుండా ఎండ వేడిమి ఉంటుంది. ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజలు బయటకి వెళ్లొద్దని వైద్య నిపుణులు సైతం హెచ్చరికలు చేస్తున్నారు. ఇంత భారీ ఎండలు ఉన్నప్పటికీ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అంగన్‌వాడీ కేంద్రాలను ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు ఒక్కపూట నడిపిస్తున్నారు. అనంతరం పౌష్టికాహారం అందించి చిన్నారులను ఇంటికి పంపిస్తున్నారు. వారు ఇంటికి వెళ్లే సమయంలో ఎండ అధికంగా ఉండటంతో పలువురు తల్లితండ్రులు చిన్నారులను కేంద్రాలకు పంపేందుకు నిరాకరిస్తున్నారు. ఎండలు తగ్గే వరకువేసవి సెలవులు మంజూరు చేసి, ఇంటికే పౌష్టికాహారం అందించాలని కోరుతున్నారు.

సరిదిద్దారు..

వైరా, ఏప్రిల్ 9: వైరా మునిసిపాలిటీలోని పాఠశాలల ప్రహరీ గోడలపై పాత పోలింగ్ తేదీలను మునిసిపల్ అధికారులు సరిదిద్దారు. ఇటీవల కొద్దిరోజుల కిందట కలెక్టర్ ఆదేశాల మేరకు పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఓటర్లను చైతన్యపరుస్తూ పాఠశాలల ప్రహరీగోడలపై పలు నినాదాలతో వాల్ రైటింగ్ రాశారు. గత ఏడాది నవంబరు 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ తేదీని నినాదాల మధ్య యథావిధిగా వదిలేశారు. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకురావడంతో మునిసిపల్ కమిషనర్ వేణు చర్యలు చేపట్టి పోలింగ్ తేదీని సరిచేసి మే 13న జరిగే లోక్‌సభ ఎన్నికల తేదీని గోడలపై రాయించారు.



గతంలో నవంబరు 30వ తేదీతో ఉన్న వాల్ రైటింగ్



ప్రస్తుతం మే 13వతేదీతో ఉన్న వాల్ రైటింగ్

ఆళ్లపల్లి బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు

● మంత్రి తుమ్మలకు కృతజ్ఞతలు తెలిపిన మండల ప్రజలు

ఆళ్లపల్లి ఏప్రిల్9: మండల పరిధిలోని మామకన్ను నుంచి ఆళ్లపల్లి మధ్య కిన్నెరసాని నదిపై నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులు నాలుగేళ్ల క్రితం నిలిచిపోయాయి. అటవీ శాఖ అధికారులు సంబంధిత శాఖ అనుమతులు లేకపోవడంతో నిర్మాణ పనులను ఆపివేశారు. నాటి నుంచి నేటి వరకు ఈ బ్రిడ్జి నిర్మాణ పనులు ఆగిపోయాయి. ఈ విషయాన్ని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల దృష్టికి ఇల్లెందు మండల కాంగ్రెస్ నాయకులు కనగాల పేరయ్య, అళ్లపలి మండల కాంగ్రెస్ మహ్మద్ అత్‌హర్‌లు తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి సంబంధింత శాఖ అధికారులతో మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపారు. వాటితో పాటు అటవీ శాఖ అనుమతులు లేక ఆగిన పలు పనులకు కూడా త్వరలో అనుమతులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నాలుగేళ్లుగా నిలిచిపోయిన పనులకు మోక్షం కలగడంతో మంత్రి తుమ్మలకు ఆళ్లపల్లి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.


అటవీశాఖ అనుమతులు పొందిన ఆళ్లపల్లి బ్రిడ్జి (ఫైల్)

జమలాపురం బ్రహ్మోత్సవాలు ప్రారంభం


సంప్రదాయబద్ధంగా తీర్థబిందెను తీసుకువస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు

మధిర ఏప్రిల్ 9: ఎర్రుపాలెంలోని జమలాపురం దేవస్థానంలో వేంకటేశ్వర స్వామి వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలను మంగళవారం ఆలయ నిర్వాహకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి సుప్రభాత సేవ, సర్వాంగ అభిషేకం, నూతన వస్త్రాలంకరణ, ఉగాది వేపపువ్వు ప్రసాద నివేదన, నిరాజనం, మంత్ర పుష్పం జరిపి భక్తులకు చందనాలంకరణలో స్వామి వారి దర్శన భాగ్యాన్ని కల్పించారు. ఆలయ వేద పండితులు శ్రీగనదలం అనంత శయనాచార్యులు పంచాంగ శ్రవణం వినిపించారు. ప్రజలు ఈ ఏడాది భక్తి బావాన్ని కలిగి ఉంటారని, సామన్య వర్షపాతం నమోదవుతుందని, ఎర్రని ధాన్యాలు అధికంగా పండుతాయని తెలిపారు. భక్త కల్యాణం, అన్నదానం నిర్వహించారు. యాగశాలనందు కార్యనిర్వాహణాధికారి కొత్తూరి జగన్మోహన్‌రావు చేతుల మీదుగా జ్యోతి ప్రజల్వన చేశారు. వేద మంత్రోచ్చరణలతో, మంగళ వాయిద్యాల నడుమ తీర్థ బిందెను తీసుకురావడంతో ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది.


పచాంగ శ్రావణం నిర్వహిస్తున్న అర్చకులు

ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టు సభ్యులు ఉప్పాల శ్రీరామ చంద్రమూర్తి, వకుళామాత స్టేడియం దాత తుళ్లూరి కోటేశ్వరావు, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూపీహెచ్ కాలనీలో అభయ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

ఖమ్మంఖానాపురంహవేలి, ఏప్రిల్9: కార్పొరేషన్ పరిధిలోని 4వ డివిజన్ యూపీహెచ్ కాలనీలోని అభయ వేంకటేశ్వరస్వామి ఆలయ 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో వేదపండితుల ఆధ్వర్యంలో అంకురార్పణ, ధ్వజారోహణ నిర్వహించారు. ఉగాది పండుగ, బ్రహ్మోత్సవాలు ఒకేరోజు కావడంతో భక్తులు అధికసంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయంలో భక్తులకు స్వామివారి ప్రసాదాన్ని ఉగాది పచ్చడిని ఆలయ కమిటీ అందించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బొల్లి కొమరయ్య, కార్యదర్శి పురం తిరుపతయ్య, కోశాధికారి బానోతు మల్సూర్‌నాయక్, అల్లిక అంజయ్య దండా జ్యోతిరెడ్డితో పాటు పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


యూపీహెచ్ కాలనీలో పూజలు చేస్తున్న భక్తులు

ఉసిరికాయపల్లిలో కోట మైసమ్మ తల్లి ఉత్సవాలు..


అలంకరణలో కోటమైసమ్మ తల్లి

కారేపల్లి, ఏప్రిల్9: మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామంలోని కోట మైసమ్మ తల్లి ఆలయంలో నేటి నుంచి శుక్రవారం వరకు మూడు రోజుల పాటు పవిత్ర బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ డాక్టర్ పర్సా పట్టాభి రామారావు, ఈవో వేణుగోపాలచార్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి


వెంకటేశ్వర్లు

కారేపల్లి, ఏప్రిల్9: వడదెబ్బ తగిలి వ్యక్తి మృతి చెందిన సంఘటన తొడితలగూడెంలో జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నారపాక వెంకటేశ్వర్లు(55) సోమవారం వ్యవసాయ పనులు చేసుకొని మధ్యాహ్న సమయంలో ఇంటికి వచ్చాడని, అప్పటి నుంచి వాంతులు చేసుకుంటున్నాడని తెలిపారు. అతడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు కుటుంబాన్ని ఆదుకోవాలని ఎంపీటీసీ ఉమశంకర్, మాజీ సర్పంచ్ కుమార్‌లు ప్రభుత్వాన్ని కోరారు.

ముగ్గురు యువకులపై హత్యాయత్నం కేసు

అశ్వాపురం, ఏప్రిల్ 9: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామానికి చెందిన ముగ్గురు యువకులపై మంగళవారం అశ్వాపురం పోలీస్ స్టేషన్‌లో హత్యాయత్నం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతకక్షల నేపథ్యంలో అశ్వాపురానికి చెందిన యువకుడిపై మల్లెలమడుగు గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు సోమవారం రాత్రి అశ్వాపురంలో దాడి చేశారు. దీంతో ఆ యువకుడు తీవ్రగాయాల పాలయ్యాడు. బాధితుడి పిర్యాదు మేరకు సదరు యువకులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించనున్నట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

ఉల్లిపాయ లారీ బోల్తా


బోల్తా పడిన లారీ

కల్లూరు, ఏప్రిల్ 9 మండలంలోని కొర్లగూడెం స్టేజి వద్ద ప్రధాన రహదారిపై మంగళవారం ఉల్లిపాయ లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఉల్లిపాయ లోడ్‌తో మహారాష్ట్ర నుంచి ఒరిస్సాకు వెళ్తున్న లారీ కొర్లగూడెం స్టేజి సమీపాన ప్రధాన రహదారిపై అదుపుతప్పి పక్కనే గల పొల్లాల్లో గల భగీరథ పైప్‌లైన్‌పై పడింది. దీంతో 600 డయ (వైశాల్యం) పైప్ లైన్ సంపు ధ్వంసమైంది. ఈ మేరకు భగీరథ నీటి సరఫరా అధికారులకు పోలీసులు సమాచారం అందించటంతో వారు కల్లూరు కేంద్రం నుంచి పైప్‌లైన్ నీటి సరఫరాను నిలిపివేశారు. లారీ బోల్తాతో ఉల్లిపాయలు చెల్లాచెదురయ్యాయి. ఈ సంఘటనపై కల్లూరు ఎస్ఐ షాకీర్ సమాచారం తెలుసుకొని వివరాలు సేకరించారు.

కోడిపందేల స్థావరంపై దాడి

ములకలపల్లి, ఏప్రిల్9: మండల పరిధిలోని పాతగంగారం గ్రామపంచాయతీ పరిధిలోని వాగొడ్డుగుంపు శివారులోని కోడిపందేలు నిర్వహిస్తున్న స్థావరంపై విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం ఎస్ఐ రాజమౌళి తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో రూ.1,600 నగదుతో పాటు 11 ద్విచక్రవాహనాలు, రెండు సెల్‌ఫోన్లు, ఆరు కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ముంబైలో బాలు బృందం ప్రదర్శన

తల్లాడ, ఏప్రిల్ 9: తల్లాడ మండలం రెడ్డిగూడెం గ్రామానికి చెందిన కాంపల్లి బాలు బృందం జానపద ధూంధాం కార్యక్రమం ఆకట్టుకుంది. ముంబైలోని ఆంధ్ర మహాసభ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. జానపద ధూంధాం పాటలతో అలరించిన కాంపల్లి బాలును అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి, ఆంధ్ర మహాసభ అధ్యక్షుడు సంకు సుధాకర్ తదితరులు ఘనంగా సత్కరించారు.


ముంబైలో రెడ్డిగూడెం కళాకారుడిని సన్మానిస్తున్న నిర్వాహకులు

తల్లిదండ్రులపై దాడి

● కుమారుడిపై కేసు నమోదు

చింతకాని, ఏప్రిల్ 9: తహసీల్దార్ కార్యాలయంలో తల్లిదండ్రులపై దాడి చేసిన కొడుకుపై చింతకాని పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన షేక్ అబ్దుల్‌నబీ తన భార్యతో కలిసి సొంత పని నిమిత్తం సోమవారం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాడు. కాగా అదే సమయంలో వారి కుమారుడు షేక్ మజీద్ ఆర్థిక లావాదేవీల విషయమై తల్లిదండ్రులపై దాడి చేసినట్లు తెలిపారు. అబ్దుల్‌నబీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మజీద్‌పై మంగళవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం


మంటలను ఆర్పుతున్న స్థానికులు

అశ్వారావుపేట, ఏప్రిల్9: విద్యుదాఘాతంతో ఆసుపాక కాలనీలో కట్టం రాముడుకు చెందిన పూరిల్లు మంగళవారం దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న వస్తువులు, దుస్తులు అన్ని కాలిబూడిదయ్యాయని బాధితుడు తెలిపాడు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

జాతరలో దొంగల్ హల్‌చల్

అశ్వారావుపేట, ఏప్రిల్9: వినాయకపురం గ్రామంలో జరుగుతున్న చిలకగండి ముత్యాలమ్మ జాతరలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. మంగళవారం రాత్రి జాతరలో దొంగలు దొంగతనాలకు పాల్పటంతో బాధితులు లబోదిబోమంటున్నారు. జాతరకు వచ్చిన ఆంధ్రరాష్ట్రం కుక్కునూరు మండలం బెస్తగూడెం గ్రామానికి చెందిన మహిళ నుంచి బ్యాగ్ చోరీ చేశారు. బ్యాగ్‌లో ఎనిమిది వేల రూపాయిలు ఉన్నట్లు బాధితురాలు అక్కడే ఉన్న పో లీసులకు ఫిర్యాదు చేసింది. అదే విధంగా మరొక వ్యక్తి వద్ద రూ.15వందల రూపాయిలు కొట్టేసినట్లు ఫిర్యాదు చేశారు.

రూ.9కోట్ల వసూళ్లే లక్ష్యం

● ముందస్తు ఆస్తిపన్ను వసూళ్లపై అధికారుల ప్రత్యేక దృష్టి

ఖమ్మంకార్పొరేషన్, ఏప్రిల్9: ఈ ఏడాది మార్చి వరకు ఆస్తిపన్ను వసూళ్ల లక్ష్యానికి చేరువగా రావడంతో ఇప్పుడు 2024-25 ఏడాదికి సంబంధించి ముందస్తు ఆస్తిపన్ను వసూళ్లపై నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఎర్లీబర్డ్ పథకం కింద ముందస్తు పన్నులు చెల్లించినవారికి ప్రభుత్వం పన్నుపై 5శాతం రాయితీ ఇస్తామని ప్రకటించింది. ఈ పథకానికి ఈనెల 30వ తేదీ వరకు గడువు ఉంది. కాగా నగరపాలకసంస్థ పరిధిలో 42,316మంది గృహ యజమానులు ఎర్లీబర్డ్ పథకం కింద ముందస్తు ఆస్తిపన్నులు చెల్లించేందుకు అర్హులని అధికారులు గుర్తించారు.

ఇప్పటి వరకు రూ. కోటి వసూలు..

ఎర్లీబర్డ్ పథకం కింద ముందస్తు పన్నుల వసూళ్ల ద్వారా గత ఏడాది నగరపాలక సంస్థకు రూ.9కోట్లు ఆదాయం వచ్చింది. ఈ ఏడాది కూడా అంతే ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆ మేరకు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే ఎర్లీబర్డ్ పథకాన్ని ప్రచారం చేయడంతో ఈ నెల 1నుంచి ఇప్పటి వరకు ముందస్తు పన్నులు రూ.కోటి వసూలు అయ్యాయి. మిగిలిన 20రోజుల్లో రూ.8కోట్లు వసూలు అవుతాయని భావిస్తున్నారు.

ముందస్తు పన్నులు చెల్లిస్తే 5శాతం రాయితీ

ఓటుహక్కుపై అవగాహన కల్పించేందుకు ఇటీవల నగరపాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి షాపింగ్ మాల్స్, ఆసుపత్రులు, హోటళ్ల యజమానులతో సమావేశం నిర్వహించి, ఆ సమావేశంలోనే ఎర్లీబర్డ్ పథకాన్ని వివరించారు. ముందస్తుగా పన్నులు చెల్లిస్తే 5శాతం రాయితీ ఇస్తామని అవగాహన కల్పించారు. ఈనెల 30 వరకు ముందస్తుగా పన్నులు చెల్లించాలని కోరారు.

గుండెపోటుతో అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు కన్నుమూత


రంగాబాయి

రఘునాథపాలెం, ఏప్రిల్ 9: గుండెపోటుతో అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు మృతి చెం దిన సంఘటన జగ్యాతండాలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..వీ వెంకటాయపాలెంలోని జగ్యాతండాకు చెందిన బానోత్ రంగాబాయి(45) అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తోంది. మంగళవారం ఉదయం ఇంట్లో పనులు చేస్తుండగా, ఒక్క సారిగా గుండెపోటుతో కూలబడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను ఖమ్మంలోని ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెం దింది. మృతురాలికి భర్త, కుమారుడు, ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు.

రేణుకా చౌదరి ప్రమాణ స్వీకారానికి తరలివెళ్లిన కాంగ్రెస్ నాయకులు

ఖమ్మం సంక్షేమవిభాగం, ఏప్రిల్ 9: కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి బుధవారం రాజ్యసభ సభ్యురాలిగా ఢిల్లీలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. దీంతో జిల్లా నుంచి భారీగా కాంగ్రెస్ నాయకులు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఢిల్లీకి బయలుదేరారు. ఖమ్మం ఏఎంసీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, మాజీ కార్పొరేటర్ వడ్డెబోయిన నర్సింహారావు, నాయకులు పోటు లెనిన్, తమ్మిని నాగేశ్వరరావు, వడ్లమూడి సురేశ్, గుర్రం శ్రీనివాస్, బోడేపూడి రాజా, మానుకొండ శివరాజ్ ఢిల్లీకి వెళ్లిన వారిలో ఉన్నారు.


రేణుకా చౌదరి ప్రమాణ స్వీకారానికి తరలివెళ్తున్న కాంగ్రెస్ నాయకులు


గాదె సత్యం దంపతులను సత్కరిస్తున్న సృజన సభ్యులు

సృజన పురస్కారాల అందజేత

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్ 9: క్రోధీనామ సంవత్సరం ఉగాది పర్వదిన్నా సృజన సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో సత్తుపల్లికి చెందిన ఇరువురికి వరుసగా 2023, 2024 సంవత్సరాలకు సంబంధించిన జీవిత సాఫల్య పురస్కారాలను మంగళవారం అందించింది. విశ్రాంత ఉపాధ్యాయులు, ప్రముఖ సాహితీవేత్త గంగులు బాబు, 20ఏళ్ల పాటు సహకార రంగంలో రైతాంగానికి సేవలందించి, ఆధ్యాత్మిక రంగంలో విశేష కృషి జరిపిన గాదె సత్యంలను పురస్కారాలు వరించాయి. ఆ ఇరువురి ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా వారివారి ఇళ్లకు వెళ్లి సత్కరించినట్లు నిర్వహకులు గట్టి వాసు, రామకృష్ణలు తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయునిగా ఎంతో సంతృప్తి పొందిన తాను మళ్లీ అవకాశం వస్తే ఉపాధ్యాయ పదవినే కోరుకుంటానని బాబు ప్రస్తావించగా, ఇతరులకు సేవ చేయడం మనకు లభించిన అదృష్టమని సత్యం అన్నారు.

పెద్దమ్మగుడిలో శ్రీదేవీ వసంత నవరాత్రోత్సవాలు ప్రారంభం

పూజలు నిర్వహించిన ఈవో దంపతులు



పూజలు నిర్వహిస్తున్న ఈవో దంపతులు

పాల్వంచ, ఏప్రిల్ 9: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం జగన్నాధపురం-కేశవపురం గ్రామాల మధ్య వేంచేసియున్న శ్రీ కనకదుర్గ దేవస్థానం (పెద్దమ్మ గుడి)లో మంగళవారం శ్రీదేవీ వసంత నవరాత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణంలో ఆలయ ఈవో సుదర్శన్ దంపతులు ఉత్సవాలను ప్రారంభించారు. ముందుగా దేవస్థాన సంప్రదాయం ప్రకారం మంగళవాయిద్యములతో, వేద మంత్రాలతో దేవస్థానం చుట్టూ ప్రదక్షిణ చేసిన పిదప దేవాలయంలో ఈవో దంపతులు కలశ స్థాపన పూజలు నిర్వహించారు. తరువాత గణపతిపూజ, పుణ్యాహవాచనం, రుత్విక‌రణ, దీక్షా వస్త్ర ధారణ, అఖండ దీపారాధన, మండపారాధనలు, మహాన్యాసపూర్వక ఏకాదశి రుద్రాభిషేకములు, హోమములను అర్చకులు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి లక్షకుసుమార్చన వైభవంగా నిర్వహించారు. సాయంత్రం పంచాంగ శ్రవణం, రాత్రి నీరాజన మంత్రపుష్పం. తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు అనేక మంది భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



స్థానాచార్యులు కేశ స్థలశాయి | ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు | ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్ | ఉప ప్రధాన అర్చకులు కోటి శ్రీమన్నారాయణాచార్యులు | అమరవాది గోపాలకృష్ణమాచార్యులు

కల్యాణం నిర్వహించే వైదిక బృందం ఇదే..

భద్రాచలం, ఏప్రిల్ 9: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో వసంతపక్ష ప్రయుక్త నవాహ్నిక శ్రీరామనవమి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ఏప్రిల్ 23 వరకు నిర్వహిస్తున్నారు. క్రోధి నామ సంవత్సరం రోజున ఉగాది పండుగ రోజున నూతన పంచాంగ శ్రవణం, తిరువీధి సేవ కార్యక్రమం నిర్వహిస్తారు. నేటి నుంచి బ్రహ్మోత్సవాలు అధికారికంగా ప్రారంభం కానున్నాయి. కాగా 17న మిథిలా స్టేడియంప్రాంగణంలోని శిల్పకళాశోభితమైన కల్యాణ మండపంలో సీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలను పాంచరాత్రాగమ శాస్త్రోక్త విధానంగా వైష్ణవ సంప్రదాయానుగుణంగా నవాహ్నిక దీక్షతో ఇక్కడ నిర్వహిస్తారు. ఈసారి బ్రహ్మోత్సవాలు స్థానాచార్యులు కేశ స్థలశాయి పర్యవేక్షణలో అధ్వర్యులుగా ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, అమరవాది విజయరాఘవన్, ఆచార్యులుగా ఉప ప్రధాన అర్చకులు కోటి శ్రీమన్నారాయణాచార్యులు, బ్రహ్మగా ఉప ప్రధాన అర్చకులు అమరవాది గోపాలకృష్ణమాచార్యులు, రుత్వికులుగా ఉప ప్రధాన అర్చకులు అమరవాది మురళీకృష్ణమాచార్యులు, అర్చకులు పొడిచేటి సీతారామాచార్యులు, అలంకార రుత్వికులుగా ఉప ప్రధాన అర్చకులు కోటి రామస్వరూప్ రాఘవచార్య, ముఖ్య అర్చక కోటి విష్ణువర్ధనాచార్యులు, పరిచారక రుత్వికులుగా తిరుమల రాఘవాచార్యులు వ్యవహరించనున్నారు.



ఉప ప్రధాన అర్చకులు అమరవాది మురళీకృష్ణమాచార్యులు | అర్చకులు పొడిచేటి సీతారామాచార్యులు | ఉప ప్రధాన అర్చకులు కోటి రామస్వరూప్ | ముఖ్య అర్చక కోటి విష్ణువర్ధనాచార్యులు, | పరిచారకులు తిరుమల రాఘవాచార్యులు

మావోయిస్టులు మూయించారు.. పోలీసులు తెరిపించారు

ఛత్తీస్‌గఢ్‌లో ఆలయాన్ని తెరిపించిన సీఆర్‌పీఎఫ్ బలగాలు



పూజలు నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ సిబ్బంది

దుమ్ముగూడెం ఏప్రిల్ 9: దండకారణ్యంలో మావోయిస్టుల చర్యలకు ప్రతిచర్యలు చేపడుతూ సీఆర్‌పీఎఫ్ బలగాలు స్థానిక ఆదివాసీలకు దగ్గరవుతున్నాయి. తాజాగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా చింతలనార్ పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యంత మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన కేరళపొందలో మావోయిస్టులు మూసివేయించిన అతి ప్రాచీనమైన రామాలయాన్ని సీఆర్‌పీఎఫ్ బలగాలు మంగళవారం తెరిపించాయి. సీఆర్‌పీఎఫ్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. రామలక్ష్మణ, హనుమంతుని విగ్రహాలున్న అతి పురాతనమైన ఈ రామాలయాన్ని మావోయిస్టులు 2003లో మూసివేయించి తాళాలు వేశారు. అప్పటి నుంచి ఈ ఆలయంలో ఎటువంటి పూజలు జరగలేదు. ఈ ప్రాంతంలో ఇటీవల సీఆర్‌పీఎఫ్ 74 బెటాలియన్ నూతన క్యాంపును ఏర్పాటు చేశారు. గుడి తెరిస్తే తమను మావోయిస్టులు ఇబ్బంది పెడతారని, మీరే గుడిని తెరిచి పూజలు చేయాలని గ్రామస్థులు కోరారు. దాంతో ముందడుగు వేసిన సీఆర్‌పీఎఫ్ సిబ్బంది గుడి తలుపులు తెరవడంతోపాటు, ఆలయాన్ని శుభ్రం చేశారు. ప్రతీరోజు ఆలయంలో పూజలను నిర్వహించేందుకు గ్రామస్థులు ఉత్సాహాన్ని ప్రదర్శించారని అధికారులు తెలిపారు.

ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ పథసంచలన్ కవాత్



కవాతు నిర్వహిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు

లక్ష్మీదేవిపల్లి, ఏప్రిల్ 9: ప్రపంచంలోనే భారతజాతి కీర్తిపతాకాన్ని ఎగురవేయడమే లక్ష్యంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) పని చేస్తుందని ఆ సంఘ్ ముఖ్య నాయకులు ఉద్ఘాటించారు. మంగళవారం కొత్తగూడెంలో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో పథ సంచలన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పథ సంచలన్‌ను ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు, మద్దతుదారులతో శ్రీ రామచంద్ర ఉన్నత పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి అనంతరం సూపర్‌బజారు సెంటరు మీదుగా రైతుబజారు, కూలీలైన్ ఏరియా నుంచి తిరిగి శ్రీ రామచంద్ర ఉన్నత పాఠశాల వరకు వందలాదిమంది కవాత్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ కార్యవహ చేపూరి రాంచందర్‌రావు, కార్యవహ పిల్లి రాజేశ్వరరావు, బాధ్యులు వెంకటరెడ్డి, వెంకటేశ్వరరావు, నరహరి, సుమన్, ఉమామహేష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రంగా కిరణ్, గుమలాపురం సత్యనారాయణ, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు, మద్దతుదారులు పాల్గొన్నారు.

పర్ణశాలలో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

దుమ్ముగూడెం, ఏప్రిల్ 9: భద్రాచల సీతారామచంద్రస్వామి వారి అనుబంధ ఆలయమైన పర్ణశాల రామాలయంలో మంగళవారం శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. మూలవరుల అభిషేకం, ఉత్సవస్నపనం, తిరువారాధన, స్వామివారికి వేద విన్నపములు, భగవద్ప్రార్థన, విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విక్‌వరణం, మృత్సంగ్రహణం, బ్రహ్మోత్సవాల అంకురారోపణలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఆలయంలో ఉగాది పంచాగశ్రవణం, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం తిరువీధి సేవకు ఏర్పాటు చేశారు. ముఖ్య అర్చకులు కిరణ్‌కుమారాచార్యులు, ప్రత్యేక అధికారి అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు అందని వేతనాలు

- రెగ్యులర్ తపాల ఉద్యోగి లేక నిలిచిన కూలి
- 700 మంది కూలీల ఇక్కట్లు
- త్వరలో చెల్లిస్తామంటున్న ఏపీవో



'ఉపాధి' పనిలో పాల్గొన్న కూలీలు (ఫైల్)

రఘునాథపాలెం, ఏప్రిల్ 9: తపాల ఉద్యోగి రాజీనామా ఉపాధి కూలీలకు ఆర్థిక ఇబ్బందులను తెచ్చి పెట్టింది. ప్రతి గ్రామంలో బ్యాంకులు అందుబాటులో లేకున్న తపాలశాఖ కార్యాలయం అందుబాటులో ఉంటుందని తపాల శాఖలో ఖాతాలు తెరిచిన ఉపాధి కూలీలకు కూలి అందక పోవటంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రఘునాథపాలెం మండలంలోని చింతగుర్తిలో 700 మంది వరకు దళిత, ఇతర వర్గాల వారు ఉపాధి హామీ పథకంలో పనులకు వెళ్తున్నారు. అయితే గ్రామంలో బ్యాంకులు లేవని ఉపాధి హామీ అధికారులు చింతగుర్తిలోని తపాలశాఖ కార్యాలయంలో కూలీలకు ఖాతాలు చేర్పించారు. ఇంత వరకు బాగానే ఉంది. అయితే నాలుగు నెలల క్రితం తపాల కార్యాలయంలో పనిచేసే రెగ్యులర్ ఉద్యోగి రాజీనామా చేశారు. దీంతో ఉపాధి కూలీలకు పేమెంట్ సమస్య ఏర్పడింది. తపాల శాఖ ఆదేశాల మేరకు రెగ్యులర్ ఉద్యోగి పనిచేసిన ప్రాంతంలో మాత్రమే (ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంకు) పోస్టల్ పేమెంట్ మిషన్లు అందుబాటులో ఉంచుతారు. ప్రస్తుతం తపాల కార్యాలయంలో తాత్కాలిక ఉద్యోగి బాధ్యతలు నిర్వహించటంతో పేమెంట్ మిషన్‌ను ఇవ్వలేదు. దీంతో చింతగుర్తి గ్రామ పంచాయతీలో నాలుగు నెలలుగా కూలీలకు డబ్బులు చెల్లింపులు జరగక పోవటంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై ఆంధ్రజ్యోతి స్థానిక ఏపీవోను వివరణ కోరగా తపాల శాఖ చెల్లింపులను మార్పులు చేసి గ్రామంలోని బ్యాంకుకు అనుబంధంగా ఉన్న ఏజెన్సీ ద్వారా అందిస్తామని, త్వరలో సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.



ఖాళీగా ఉన్న తపాల ఉద్యోగి కుర్చీ

రోడ్లు వెడల్పు ఉంటేనే ఆస్తుల విలువ పెరుగుతుంది


● ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



భట్టికి వినతిపత్రం ఇస్తున్న భవన యజమానులు

మధిరటౌన్, ఏప్రిల్9: రోడ్లు వెడల్పు ఉంటేనే ఆస్తుల విలువ పెరుగుతుంది, వ్యాపారాలు కూడా బాగుంటాయని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. అంబేద్కర్ సెంటర్ నుంచి శివాలయం వరకు చేపట్టనున్న రోడ్డు విస్తరణతో నష్టపోయే భవన యజమానులు మంగళవారం మధిర లోని క్యాంపు కార్యాలయంలో భట్టిని కలిసి వినతిపత్రం అందజేసి రోడ్డు విస్తరణ వెడల్పును తగ్గించాలని కోరారు. అంబేద్కర్ సెంటర్ నుంచి శివాలయం వరకు నిత్యం ఎదురవుతున్న ట్రాఫిక్ కష్టాలు మీకు తెలిసిందేనని అన్నారు. వైరా నదిపై బ్రిడ్జి నిర్మిస్తే మడుపల్లికి దూరం తగ్గుతుంది అనే ఉద్దేశ్యంతో పాటు మడుపల్లి ప్రజల చిరకాల కోరికను తీర్చేందుకు మరియు మధిర లో ఈ రోడ్డులో ఉన్న వారి వ్యాపారాలు బాగుంటాయనే విస్తరణ చేపట్టడం జరుగుతుందని అన్నారు. మీకు ఇబ్బందులు కలిగేతే విస్తరణ చేపట్టమని భట్టి వారికి తెలపగా 60 అడుగులు వరకు విస్తరిస్తారని తెలుస్తుందని, దీనిని 36 అడుగులకు తగ్గించాలని కోరగా తప్పక పరిశీలిస్తానని భట్టి వారికి తెలిపారు కనీసం రోడ్డు 40 అడుగులైనా ఉండాలని పలువురు కోరుతున్నారు. అవసరమైతే తాము కూడా డిప్యూటీ సీఎం భట్టిని కలిసి వినతి పత్రం అందజేస్తామని పలువురు తెలిపారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంపీ అభ్యర్థి బలరాం నాయక్, ఎమ్మెల్యే తెల్లం

భద్రాచలం ఏప్రిల్ 9: భద్రాచలంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా అశోక్ నగర్ కాలనీలో గల మసీదు వద్ద జరిగిన ఇఫ్తార్ విందులో మహబూబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు పాల్గొని ఇఫ్తార్ విందు స్వీకరించారు. రంజాన్ ఉపవాసాల్లో భాగంగా ముస్లిం సోదరులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కే ఆలీ పాషా, భోగాల శ్రీనివాసరెడ్డి, మస్తాన్ వలీ, కౌసర్ మసీద్ గౌరవ అధ్యక్షుడు షరీఫ్ అధ్యక్షులు అబ్దుల్లా అక్బర్ సలీం అత్తర్ హైదర్ బాజీ తదితరులున్నారు.

అన్నలపై ముప్పేట దాడి

- నెల రోజుల్లో ఐదు ఎన్‌కౌంటర్లు
- 26 మంది మావోయిస్టులు మృతి
- అడవుల్లో ఆందోళనలో ఆదివాసీలు



చర్ల, ఏప్రిల్ 9: యాంటీ నక్సల్స్ ఆపరేషన్‌లో భాగంగా దండకారణ్యంలోకి ఐదు రాష్ట్రాల బలగాలు చొచ్చుకుపోతున్నాయి. మావోయిస్టుల కదలికలను పోలీసలు వ్యూహాత్మకంగా తెలుసుకుంటున్నారు. గత కొద్ది రోజులుగా దండకారణ్యంలో జరుగుతున్న భారీ

నివ్వురు గప్పిన నిప్పులా దండకారణ్యం..

వరుస ఎన్‌కౌంటర్లు దండకారణ్యంలో నివసిస్తున్న ఆదివాసీలకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. అడవుల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో, ఎక్కడ, ఎప్పుడు తుపాకులు పేలుతాయోనని ఆందోళన చెందుతున్నారు. అడవుల్లోని ఆదివాసీలు బయటకు వచ్చేందుకు కూడా వణికిపోతున్నారు. ప్రస్తుతం దండకారణ్యంలో మావోయిస్టులు, పోలీసుల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. రావణ కాష్టంలా అడవులు రగిలిపోతున్నాయి. బిక్కుబిక్కుమని ఆదివాసీలు కాలం వెళ్లదీస్తున్నారు. వరుస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో మావోయిస్టులు 15న ఐదు రాష్ట్రాల బంద్‌కు పిలుపు నివ్వడంతో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక ఆదివాసీలు ఆందోళన చెందుతున్నారు.

ఎన్‌కౌంటర్లే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. మరోవైపు వరుస ఎన్‌కౌంటర్లలో క్యాడర్‌ని కోల్పోతున్న మావోయిస్టులు తాజా పరిస్థితిపై సమీక్షించుకుంటున్నట్లు తెలుస్తోంది. 'ఎన్‌కౌంటర్లు ఎలా జరుగుతున్నాయి. సమాచారం ఎలా వెళ్లింది' అన్న కోణంలో ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది.

అడవుల్లోకి ఐదు రాష్ట్రాల బలగాలు

మావోయిస్టుల ఏరివేతలో భాగంగా సరిహద్దు దండకారణ్యంలోకి తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా, ఆంధ్రాకు చెందిన కేంద్ర, రాష్ట్ర బలగాలు చొచ్చుకుపోతున్నాయి. ఇప్పటికే ఆయా రాష్ట్రాల పోలీసులు ములుగు జిల్లాలో యాంటీ నక్సల్స్ ఆపరేషన్‌పై సమావేశమైనట్లు తెలుస్తోంది. మావోయిస్టుల కదలికలు తెలుసుకుని సంయుక్త ఆపరేషన్ చేసేందుకు సిద్ధమైనట్లు సమాచారం. ఇందులో భాగంగా ఆయా రాష్ట్రా బలగాలు అడవులోకి చొచ్చుకుపోతున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ నుంచి గ్రేహౌండ్స్, స్పెషల్ పార్టీ, ఛత్తీస్‌గఢ్ నుంచి డీఆర్‌జీ, కోబ్రా, ఎస్‌టీఎఫ్, బస్తర్ ఫైటర్స్, మహారాష్ట్ర సీ60, సీఆర్‌పీఎఫ్, ఒడిశా నుంచి సీఆర్‌పీఎఫ్, ఆంధ్రా నుంచి స్పెషల్‌పార్టీ, సీఆర్‌పీఎఫ్ బలగాలు కూబింగ్‌లో పాల్గొంటున్నాయి.

మూడు రాష్ట్రాల పరిధిలో ఐదు ఎన్‌కౌంటర్లు .....

గత నెల రోజుల్లో మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ సరిహద్దు అడవుల్లో మొత్తం ఐదు ఎన్‌కౌంటర్లు జరగ్గా, మొత్తం 26మంది మావోయిస్టులు మృతి చెందారు. మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో తెలంగాణ మావోయిస్టు పార్టీకి చెందిన నలుగురు నక్సల్స్, బీజాపూర్ అడవుల్లోని పిడియా, బాసగూడ, గంగలూరి అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్లల్లో 19 మంది నక్సల్స్, తెలంగాణలోని ములుగు జిల్లా కర్రిగుట్టల్లో జరిగిన ఎన్‌కౌంటర్లలో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో మావోయిస్టు పార్టీలో పనిచేస్తున్న ముఖ్య నాయకులు ఉన్నారు. కాగా వరుస ఎన్‌కౌంటర్లతో మావోయిస్టులు ఉక్కిరిబిక్కిరవ్వుతున్నారు. వరుసగా పార్టీ కేడర్ కూలిపోతుండడంతో నాయకులు కూడా ఆందోళన చెందుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్లలో పైచేయి సాధించడంతో పోలీసు బలగాలు మావోయిస్టుల కోసం గాలింపుని ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది...

వైభవంగా కోటమైసమ్మ అమ్మవారి జాతర

కామేపల్లి, ఏప్రిల్ 9: కామేపల్లి మండల పరిధిలోని కొత్తలింగాల కోటమైసమ్మ తల్లి ఆలయంలో ఉగాది సందర్భంగా నిర్వహించే జాతర మంగళవారం ఘనంగా జరిగింది. కోటమైసమ్మ అమ్మవారికి మొక్కులు చెల్లించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. జాతరకు హాజరైన భక్తులకు లింగాల ఎంపీటీసీ రాంరెడ్డి జగన్నాథరెడ్డి పులిహార, పొంగలి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ మల్లెంపాటి శ్రీనివాసరావు, ఎంపీటీసీ మల్లెంపాటి నర్సింహరావు, ఇట్టా శ్రీను తదితరులున్నారు.



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి



శ్రీకాంత్

దుమ్ముగూడెం, ఏప్రిల్ 9: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన చర్ల మండలం రాళ్లగూడెం వద్ద జరిగింది. వివరాల ప్రకారం.. లక్ష్మీనగరం బోయబజారుకు చెందిన కొవ్వాల శ్రీకాంత్(15) తన దగ్గర బంధువైన మరో యువకుడు జంగిటి తేజముత్యాలుతో కలిసి ద్విచక్ర వాహనంపై పర్ణశాల రామాలయానికి బయల్దేరి వెళ్లారు. గుడి మూసి ఉండడంతో చర్ల వైపు సరదాగా వెళ్తుండగా, రాళ్లగూడెం మూల మలుపు వద్ద ఎదురుగా వస్తున్న కారు వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో రోడ్డుపై అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. కాగా మృతుడు ఇటీవలె పదోతరగతి పరీక్షలు రాశాడు. విద్యార్థి మృతితో బోయబజారులో విషాదఛాయలు అలుముకున్నాయి.

హస్తంలో అదే సందిగ్ధం



ఖమ్మం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థుల జాబితా అన్ని చోట్ల ప్రకటించినా ఖమ్మం కాంగ్రెస్ టికెట్ విషయం మాత్రం అధిష్ఠానం తేల్చలేకపోతోంది. ఇప్పట్లో ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి ఎవరన్నది తేలే పరిస్థితి కనిపించడంలేదు. ఖమ్మం కాంగ్రెస్ టికెట్ విషయంలో ప్రతిసారీ ఉత్కంఠ నెలకొంటుంది. చివరికి వరకు టికెట్ ఎవరికి వస్తుందో.. ఎవరు బరిలో దిగుతారో తేల్చలేని పరిస్థితి ఉంటుంది. ఉమ్మడి రాష్ట్రంతో పాటు ఇప్పుడు ప్రత్యేక రాష్ట్రంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఉమ్మడి రాష్ట్రంలో జిల్లా యేతరులు అనేక మంది చివరి నిమిషంలో ఖమ్మం కాంగ్రెస్ టికెట్ పొంది విజయఢంకా మోగించారు. గతంలో తేళ్ల లక్ష్మీకాంతమ్మ, రంగయ్యనాయుడు, నాదేళ్ల భాస్కరరావు, రేణుకాచౌదరి వంటి ప్రముఖులు అనూహ్యంగా ఖమ్మం టికెట్ పొంది విజయం పొందారు. ఈసారి కూడా ఖమ్మం కాంగ్రెస్ టికెట్‌కు గట్టి పోటీ నెలకొంది. ఖమ్మం ఎంపీ రేసులో ఉన్న రేణుకాచౌదరి రాజ్యసభకు ఎంపిక కావడంతో ముందుగానే ఆమె పోటీనుంచి తప్పుకున్నారు. ప్రస్తుతం ముగ్గురు మంత్రుల సంబంధీకులతో పాటు ఇతర నేతలు రంగంలో నిలిచారు. వీరితో పాటు తాజాగా మాజీమంత్రి, నిజామాబాద్ జిల్లాకు చెందిన మాజీమంత్రి మండవ వెంకటేశ్వరరావు పేరు ప్రచారంలోకి వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల ముదు కాంగ్రెస్‌లో చేరిన మండవకు రాష్ట్ర ప్రణాళిక సంఘం చైర్మన్ పదవి ఇస్తారని ప్రచారం జరిగింది. తాజాగా ఆయన పేరు ఖమ్మం ఎంపీకి పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఖమ్మం ఎంపీ స్థానంలో ఇప్పటివరకు కాంగ్రెస్ 11సార్లు విజయం సాధించింది. ప్రారంభంలో రెండుస్లారు పీపుల్స్‌డెమొక్రటిక్ పార్టీ, ఒకసారి సీపీఎం, ఒకసారి వైసీపీ, ఒకసారి టీడీపీ, ఒకసారి టీఆర్‌ఎస్ విజయం సాధించాయి.

ఎవరికివారు పోటీపోటీ..

లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్‌కు సమయం ఆసన్నమవుతోంది. ఇప్పటికే ఖమ్మం నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు, బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోదరావు ప్రచారాన్ని ప్రారంభించారు. కాంగ్రెస్ టికెట్‌కోసం ముగ్గురు మంత్రుల కుటుంబాల నుంచి పోటీ ఉండడంతో ఎవరికి టికెట్ ఇస్తే ఎవరికి కోపం అన్న చందాన కాంగ్రెస్ పార్టీ నిర్ణయాన్ని తీసుకోవడం లేదు. రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు పొంగులేటి ప్రసాదరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు తుమ్మల యుగంధర్ టికెట్ రేసులో ఉండగా, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని సైతం టికెట్ బరిలో ఉన్నారు. వీరు కాకుండా ఖమ్మం టికెట్ కోసం మాజీ ఎంపీ వి.హనుమంతరావుతోపాటు మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, వ్యాపారవేత్త వంకాయలపాటి రాజేంద్రప్రసాద్, గ్రానైట్ అసోసియేషన్ రాష్ట్రనాయకులు, కాంగ్రెస్ నేత రాయల నాగేశ్వరరావు, మానుకొం డ రాధాకిషోర్ నాగసీతారాములు తదితరులు పోటీలో ఉన్నారు. హైదరాబాదుకు చెందిన జట్టి కుసుమకుమార్, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బంధువు రామసహాయం రాఘురామిరెడ్డి కూడా ఖమ్మం టికెట్ పోటీలో ఉన్నట్లు సమాచారం. తాజాగా నిజామాబాద్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు పేరు కూడా ఖమ్మం టికెట్ కోసం వినిపిస్తోంది.

ఎటూ తేల్చలేకపోతున్న అధిష్ఠానం

ఖమ్మం అభ్యర్థి అంశంపై ఇప్పటికే పీసీసీ, ఏఐసీసీ స్థాయిలో చర్చలు జరిగినా అభ్యర్థి ఎవరన్నది నిర్ణయం తీసుకోలేదు. ఒక దశలో రాష్ట్ర పీసీసీకే అధికారం ఇచ్చారని ప్రచారం జరిగింది. రాష్ట్ర పీసీసీ కూడా ఖమ్మం టికెట్ వ్యవహారాన్ని ఢిల్లీ నిర్ణయానికే వదిలేసింది. తుక్కుగూడ సభ తర్వాత ఖమ్మం టికెట్ నిర్ణయం ఉంటుందని పార్టీ వర్గాలు చెప్పినా ఖమ్మం టికెట్ మాత్రం ఖరారు చేయలేదు. దీంతో ఖమ్మం కాంగ్రెస్ టికెట్ పంచాయతీ ఇప్పట్లో తేలే పరిస్థితి కనిపించడంలేదు ఖమ్మం టికెట్ తెచ్చుకుంటే చాలు గెలుపు గ్యారంటీ అన్న ప్రచారం ఉండడంతో ఈ సీటుకోసం పోటీ తీవ్రంగా ఉంది. అభ్యర్థి ఎంపిక విషయంలో జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రుల మధ్య ఐక్యత లేకపోవడంతో ముగ్గురు కలిసి ఒకే పేరును సూచించలేకపోతున్నారు. దాంతో అభ్యర్థి ప్రకటన మరింత ఆలస్యమవుతోంది.

ట్రాఫిక్ ఉల్లంఘించిన ఇద్దరు యువకులపై కేసు నమోదు

పాల్వంచ, ఏప్రిల్ 9: ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడిన ఇద్దరు యువకులపై పాల్వంచ పట్టణ పోలీసులు మంగళవారం కేసులు నమోదు చేశారు. పాల్వంచ పట్టణానికి చెందిన మోయిన్‌పాషా సర్వీస్ ఆటో నడుపుతూ దమ్మపేట సెంటర్ నుంచి బస్టాండ్ వైపు బయలుదేరాడు. ఈ క్రమంలోనే తన ఆటోలో ఉన్న డెక్ (సౌండ్ సిస్టం) వాల్యూమ్ పెంచి ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేశాడు. అంతే కాక అతివేగంగా, అజాగ్రత్తగా వ్యవహరించినందుకు అతడిపై పాల్వంచ పోలీసులు కేసు నమోదు చేశారు. అదే విధంగా ద్విచక్ర వాహనంపై అతివేగంగా వెళుతూ ప్రయాణికులను భయభ్రాంతులకు గురి చేసిన నవీన్‌పై కేసు నమోదు చేశారు.

ఖమ్మం బిషప్‌గా ప్రకాష్

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 9: ఆర్‌సీఎం ఖమ్మం పీఠం బిషప్‌గా సగిలి ప్రకాష్ అభిషేక మహోత్సవం మండల పరిధిలోని కరుణగిరి కేథడ్రల్ చర్చిలో మంగళవారం వేడుకగా నిర్వహించారు. హైదరాబాద్ అగ్ర పీఠాధిపతి కార్డినల్ ఆర్చ్ బిషప్ పూల అంథోని, పీఠాధిపతులు గాలి బాలి (కడప), ఉడుముల బాల (వరంగల్ ఖమ్మం) మహోత్సవం నిర్వహించారు. శోభయాత్ర ఖమ్మం కొత్త బస్టాండ్ నుంచి కేథడ్రల్ చర్చి వరకు సాగింది. పోప్ భారతదేశ ప్రతినిధి సెక్రటరీ కేవియన్ జాయింట్ జస్టిస్ లాటిన్ భాషలో నూతన బిషప్‌కి ప్రమాణ పత్రాన్ని అందించారు. అనంతరం ప్రకాష్ బైబిల్ గ్రంథాన్ని అందించారు. కార్యక్రమంలో జోసెఫ్ రాజారావు, పోలేమేర జయరావు, రాయిరాల విజయ్‌కుమార్, మల్లవరపు ప్రకాష్, ఫైపాన్‌పాల్, మాథ్యూవరప్రసాద్ రాజు, శౌరి, సుధాకర్, స్టీవ్‌అప్ప, సురేష్ పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి: డీఎస్పీ

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఏప్రిల్ 9: వాహనదారులు నిబంధనలు పాటించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ అన్నారు. నెంబరు ప్లేట్లు లేకుండా తిరిగే వాహనాలను సీజ్ చేసి ఆ వాహనదారులపై చీటింగ్ కేసులు నమోదు చేస్తామన్నారు. అందులో భాగంగా కొత్తగూడెం వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో నెంబరు ప్లేట్లు, సరైన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలను నడుపుతూ పట్టుబడిన వారిపై చీటింగ్ కేసులు నమోదు చేస్తామన్నారు. దొంగతనాలు, చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడే నేరస్తులు నెంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలను ఉపయోగిస్తున్నారని తెలిపారు. అలాంటి నేరాల నియంత్రణ, ఛేదన కోసం ఈ ప్రత్యేక డ్రైవ్ చేపట్టడం జరుగుతుందని తెలియజేశారు. నేరాల నియంత్రణకు పోలీసు వారు చేపడుతున్న రక్షణ చర్యలకు ప్రజలందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సంప్రదాయబద్ధంగా ఉగాది వేడుకలు

కిక్కిరిసిన ఆలయాలు.. ప్రత్యేక పూజలు.. పంచాగ శ్రవణాలు

కొత్తగూడెం సాంస్కృతికం, ఏప్రిల్ 9: శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను మంగళవారం కొత్తగూడెంలోని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా గృహాలు, వ్యాపార సముదాయాలు, మామిడి తోరణాలు, వేప మండళ్లతో శోభయమానంగా తీర్చిదిద్దుకున్నారు. ఈ సందర్భంగా ఉగాది పచ్చడిని సేవించారు.

సింగరేణి ప్రధాన కార్యాలయంలో

శ్రీ క్రోధినామ సంవత్సర పర్వదినాన్ని పురస్కరించుకుని సింగరేణి ప్రధాన కార్యాలయంతో పాటు మైన్స్, డిపార్టుమెంట్ల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో డైరెక్టర్ డి.సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. సింగరేణి యాజమాన్యం ఈ ఏడాది నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జీఎంలు సత్యనారాయణ రాజు, దామోదర్‌రావు, జానకీరామ్, సీహెచ్. నవీన్‌కుమార్, పిట్టర్లాండ్ జేసురత్నం, జగన్‌మోహన్‌రావు, అధికారులు మాచారయ్య, కమలాకర భూషణ్, కేవీ. రావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కూనంనేనికి శుభాకాంక్షలు

చుంచుపల్లి: కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుకు జిల్లా మాదిగ సంక్షేమ సంఘం సభ్యులు ఉగాది పండుగ శుభాకాంక్షలు మంగళవారం తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాదిగ సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ కొయ్యడ వెంకన్న, జిల్లా కార్యదర్శి సామర్ల సమ్మయ్య, జిల్లా నాయకులు బరిగెల భూపేష్‌కుమార్, మాతంగి లింగయ్య, మాటేటి గోపాల్, బొంకూరి పోశం, ఇండిగపల్లి శంకర్, జంగం కృష్ణ, అన్నం లక్ష్మీనారాయణ, అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడులో..

శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను మండల వ్యాప్తంగా ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని వివిధ గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజ కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ప్రజలు ఆలయాలకు వెళ్లి పూజలు చేసి తమ భక్తిపారవశ్యాన్ని చాటుకున్నారు. ఆలయాల్లో పురోహితులు పంచాంగ శ్రవణాన్ని చదివి వినిపించారు.

అశ్వాపురంలో..

అశ్వాపురం: ఉగాది వేడుకలను మంగళవారం ప్రజలు మండలంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉగాది పచ్చడిని ఆరగించారు. ఎంపీపీ ముత్తినేని సుజాత ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. అశ్వాపురం సీఐ అశోక్‌రెడ్డి, ఎస్‌ఐలను శాలువాలతో సత్కరించారు. మొండికుంట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎంపీటీసీ కమటం నరేష్ ఆధ్వర్యంలో జరిగిన ఉగాదివేడుకల్లో కార్యకర్తలకు ఉగాది పచ్చడిని అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు షర్ఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచలో..

పాల్వంచ టౌన్: ఉగాది పర్వదినం సందర్భంగా మంగళవారం పలు దేవాలయాలకు భక్తుల తాకిడి పెరిగింది. శ్రీనివాసకాలనీ శ్రీనివాసగిరి (గుట్ట) వెంకన్నను భక్తులు అధికసంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అదేవిధంగా పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు తోలేటి నగేష్ శర్మ, ఆరుట్ల ఫణిరాజాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి తెల్లవారు ఝాము నుంచే ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. భక్తులకు తెలుగు సంవత్సర పంచాంగ శ్రవణం వినిపించారు. భజనమందిర శ్రీ రామాలయం, బొల్లోరుగూడెం రామాలయం, గట్టాయిగూడెం భక్తాంజనేయస్వామి దేవాలయం, సీ కాలనీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయాలతోపాటు పలు ఆలయాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని పూజలు జరిపారు.

ఇల్లెందులో..

ఇల్లెందుటౌన్: ఉగాది పర్వదినం సందర్భంగా ఇల్లెందు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రత్యేక పూజల్ని నిర్వహించారు. అదే విధంగా మునిసిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మంచినీటి చెరువు లేక్ పార్కు వద్ద ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి పంచాంగ శ్రవణం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కనకయ్యతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ములకలపల్లిలో..

ఉగాది వేడుకలను మండల వ్యాప్తంగా ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారురుఝాము నుంచే భక్తులు దేవాలయాలకు చేరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ములకలపల్లి శివాలయంలో సురేష్ శర్మ పండితుడు పంచాంగ శ్రవణం చదివి వినిపించారు. ఆంజనేయస్వామి దేవాలయంలో పంచాంగ శ్రవణం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజలో గ్రామ పెద్దలు, పుర ప్రముఖులు హాజరయ్యారు. మండల వ్యాప్తంగా పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



ఎమ్మెల్యే కూనంనేనికి శుభాకాంక్షలు



పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ఇల్లెందు మునిసిపల్ చైర్మన్



క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కనకయ్య పూజలు



ఎమ్మెల్యే 'పాయం'కు ఎంపీపీ శుభాకాంక్షలు



కొత్తగూడెం గణేష్ టెంపుల్‌లో సందడి

కళాపరిషత్ సేవలు అభినందనీయం

ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి భానుమతి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి భానుమతి

పాల్వంచ టౌన్, ఏప్రిల్ 9: పాల్వంచ కళాపరిషత్ వారి ఆధ్వర్యంలో గత కొన్ని సంవత్సరాలుగా ఉగాది సంబరాలను ఘనంగా నిర్వహిస్తూ ఉగాది విశిష్టతను భవిష్యత్ తరాలకు ఉగాది ఉత్సవాల ద్వారా తెలియచేస్తున్న వారి సేవలు అభినందనీయమని కొత్తగూడెం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, సెక్రటరీ లీగల్ సర్వీసెస్ అథారిటి జి. భానుమతి అన్నారు. పాల్వంచ కళాపరిషత్ ఆధ్వర్యంలో శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాది సంబరాలు స్థానిక థియేటర్ ప్రాంగణంలో మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జడ్జి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పలువురు చిన్నారులు ప్రదర్శించిన జానపద, కూచిపూడి, భరతనాట్యం, పలు కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జాతీయ బాలోత్సవ్ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రమేష్‌బాబు, పాల్వంచ కళాపరిషత్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ బిక్కసాని సుధాకర్‌రావు, అధ్యక్షులు ముంతపురి రాజుగౌడ్, ప్రధాన కార్యదర్శి వేముల కొండలరావు, ఉపాధ్యక్షులు డాక్టర్ నామా బుచ్చయ్య, కోశాధికారి టి. లింగమూర్తితోపాటు పలువురు పట్టణ ప్రముఖులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ గరిగెల ఊరేగింపు

భద్రాచలం, ఏప్రిల్ 9: ఉగాదిని పురస్కరించుకొని భద్రచలంలో ముత్యాలమ్మ గరిగెల ఊరేగింపును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పవిత్ర గోదావరి నుంచి ముత్యాలమ్మ తల్లి గరిగెలను పల్లకిపై ఉంచి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం డప్పు వాయిద్యాలతో చప్టా దిగువ, రాజవీధి, తాతగుడి సెంటర్, ఎల్ఐసీ రోడ్డు మీదుగా ముత్యాలమ్మ తల్లి ఆలయానికి తీసుకెళ్లారు. ఈ సమయంలో వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించి సారె, ప్రసాదాలను అమ్మవారికి సమర్పించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వి.వెంకటేశ్వరరావు, రాజమండ్రి అచ్యుత్, రాజమండ్రి సాయి, శ్రీరామమూర్తి, వీరయ్య, మేకల శ్రీను పాల్గొన్నారు.

రామాలయంలో ఉగాది కవి సమ్మేళనం

భద్రాచలం, ఏప్రిల్ 9: శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో రామాలయంలో మంగళవారం ఉగాది కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, గుదిమెళ్ల కృష్ణమాచార్యులు, గాదె మాధవరెడ్డి, కళావేదిక అధ్యక్షురాలు చిట్టే లలిత ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది పామరాజు తిరుమలరావు, కేవీవీఎస్ మూర్తి, నాగలక్ష్మి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తాం



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రుద్రంపూర్, (సింగరేణి) ఏ ప్రిల్ 9: సింగరేణి కార్మికుల స మస్యల పరిష్కారమే లక్ష్యంగా ఐఎన్‌టీయూసీ పని చేస్తుందని ఐఎన్‌టీయూసీ కొత్తగూడెం ఏరి యా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ తెలిపారు. మంగళవారం ఆర్‌సీ హెచ్‌పీలో కార్మికులు ఎదుర్కొం టున్న సమస్యలపై సంబంధిత అధికారికి వినతిపత్రం అందచేశారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు అవసరమైన సదుపాయాలను కల్పించాలని, వేసవి తీవ్రత వల్ల ఇబ్బందులు తలెత్తకుండా మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయాలని, వాటర్ స్ప్రేయింగ్ చేయించాలని కోరారు. అనంతరం నూతన కమిటీని ఎంపిక చేశారు. పిట్ కార్యదర్శిగా శంకర్‌బాబును నియ మించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ కార్యదర్శి అంతోటి నాగేశ్వరరావు, నాయకులు కేవశరెడ్డి, గోపు కుమార్, చిలక రాజయ్య, సమ్మయ్య, నర్సయ్య, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

భూ పోరాటాలకు నాంది పలికిన నేత చంద్ర



నివాళులర్పిస్తున్న నాయకులు

పాల్వంచ టౌన్, ఏప్రిల్ 9: దేశ వ్యాప్తంగా భూ పోరాటాలకు శ్రీకారం చుట్టిన మహానేత, సీపీఐ అగ్రనాయకులు దివంగత చంద్ర రాజేశ్వరరావు అని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాదం అన్నారు. పార్టీ కార్యాలయం సీఆర్‌భవన్‌లో మంగళవారం చంద్ర రాజేశ్వరరావు 31వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమిందారి కుటుంబంలో జన్మించిన ఆయన కమ్యూనిస్టు ఉద్యమాలకు ఆకర్షితుడై తన యావదాస్తిని పేదలకు పంపిణీ చేసిన ఆదర్శనాయకుడు అని కొనియాడారు. పేదలకు భూమి దక్కితేనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని నమ్మిన ఆయన దేశ వ్యాప్త భూ పోరాటాలకు నాంది పలికారని తెలిపారు. ఆయన ఆశయ సాధనకు పార్టీ శ్రేణులు పునరంకితం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు అడుసుమిల్లి సాయిబాబు, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, జిల్లా సమితి సభ్యులు రాహుల్, ఎం. కిరణ్, రాకేష్, జకరయ్య, ఎస్‌కే. పాషా, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, నరేష్, రామకృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.

కమ్మ సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం



చలివేంద్రం ఏర్పాటుచేసిన దృశ్యం

అశ్వారావుపేట, ఏప్రిల్ 9: కమ్మ సంఘం ఆధ్వర్యంలో అశ్వారావుపేటలో మంగళవారం చలివేంద్రం ఏర్పాటు చేసారు. బయట గ్రామాల నుండి అధిక సంఖ్యలో ప్రజలు పట్టణానికి వస్తున్నారు. వారి దాహార్తిని తీర్చేందుకు కమ్మ సేవాసంఘం ఆధ్వర్యంలో స్థానిక బస్టాండు సెంటర్‌లో కూలింగ్ ఫ్రిజ్ ఏర్పాటు చేసి మంచినీటి సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు సంకురాత్రి సతీష్, సభ్యులు పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయాలు సాధిస్తాం

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కొత్తగూడెం టౌన్, ఏప్రిల్ 9: పేద ప్రజల హక్కుల సాధన కోసం నిరంతరం శ్రమించిన చంద్ర రాజేశ్వరరావు ఆశయ సాధనకు కృషి చేస్తామని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. మంగళవారం శేషగిరిభవన్‌లో చంద్ర రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా జరిగిన భూ పోరాటంలో కీలకపాత్ర పోషించిన చంద్ర రాజేశ్వరరావు అనేకమంది పేదలకు గూడు కల్పించారని తెలిపారు. తన సొంత ఆస్తిని సైతం పేదలకు పంచిన మహనీయుడుగా కీర్తించారు. పేదలకు భూములు దక్కాలంటూ పోరాటాలకు శ్రీకారం చుట్టిన మహనేత అని కొనియాడారు. అమరవీరుల ఆశయ సాధనకు సీపీఐ, అనుబంధ విద్యార్థి, యువజన మహిళా ప్రతినిధులంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అమరవీరుల ఆశయాలు సాధించడమే వారికి మనం అర్పించే నిజమైన నివాళి అని అన్నారు. వారి ఆశయ సాధనకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, నాయకులు సలిగంటి శ్రీనివాస్, వీరస్వామి, రత్నకుమారి, మాతంగి లింగయ్య, మాటేటి గోపాల్, లక్ష్మినారాయణ, గోపీ, రాము, భూపేష్, హరీష్, భాగ్యలక్ష్మి, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

సమస్యలు పరిష్కరించాలని జీఎంకు వినతి

మణుగూరుటౌన్, ఏప్రిల్ 9: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరతూ.. మంగళవారం ఏరియా జీఎం దుర్గం రామచందర్‌కు పాతినిధ్య సంఘం ఐఎన్‌టీయుసీ ఆధ్వర్యంలో వినతి పత్రమందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి త్యాగరాజన్ మాట్లాడారు. పీవీ కాలనీ, కూనవరం రైల్వే గేట్ చౌరస్తా నుంచి మణుగూరు రైల్వే స్టేషన్‌కు వెళ్లే రహదారి వెంట సింగరేణి ఏర్పాటు చేసిన వీధి లైట్లు వెలగడం లేదని వెంటనే వాటిని మరమ్మత్తులు చేయించాలని కోరారు. రైల్వే సైడింగ్ నుంచి బీటీపీఎస్ వరకు పదుల సంఖ్యలో కోల్ ట్రాన్స్‌పోర్టు బొగ్గు లారీలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నాయని, ఆయా టిప్పర్ లారీలు బొగ్గు లోడ్ అయిన తర్వాత టార్పాలిన్ కట్టకుండానే రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకోవడంలేదని విమర్శించారు. తద్వార రాహదారిపై రాకపోకలు సాగించే ఇతర వాహనాదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. సింగరేణి సెక్యూరిటీ విభాగం టర్పాలిన్ కట్టకుండా బొగ్గు లారీలను బయటకు రాకుండా నిషితంగా తనిఖీ చేయాలని కోరారు. వీటితోపాటు కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. గత ఏడాది లక్ష్యాన్ని సాదించిన కార్మికులకు స్వీట్ ప్యాకెట్, ఓ జ్ఞాపికను అందించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సిల్వేరు గట్టయ్య, ఎండీ షాబుద్దీన్, సూరపాక రాములు, జయరాజ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఐఎన్‌టీయూసీ నేతలు

కోడ్ ఉన్నందున సహకరించాలి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఏప్రిల్9: ఎన్నికల కోడ్ ఉన్నందున ప్రతి ఒక్కరు కేంద్ర ఎన్నికల సంఘం విధించిన నిబంధనల మేరకు పోలీస్ వారికి సహకరించాలని కొత్తగూడెం వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ మంగళవారం సూచించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ప్రధాన రహదారులపై తనిఖీల బృందాలు వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో తమ సామాగ్రిని చూపించి వారి విధులకు సహకరించాలన్నారు. అదేవిధంగా ద్విచక్రవాహనాలను అనుమానితులను ఆపి క్షణ్ణంగా పరిశీలిస్తున్న తరుణంలో తమ పూర్తి సహకారం అందించాలన్నారు. వారి ప్రయాణంచేసే సమయాల్లో సరైన పత్రాలు, ఆధారాలు తమ వద్ద ఉంచుకోవాలన్నారు. పార్లమెంట్ ఎన్నికలు జరిగే వరకు కఠిన నిబంధనలు అమలులో ఉంటాయని నలుగురు కంటే ఎక్కువ మంది ఒక చోట కూడి ఉండకూడదన్నారు.

'బార్' అధ్యక్షుడికి ఘన సన్మానం

ఇల్లెందుటౌన్ ఏప్రిల్ 9 : ఇల్లెందు కోర్టు బార్ అసోసియేషన్‌కు నూతనంగా ఎన్నికైన రవికుమార్ నాయక్‌ను మంగళవారం బంజార సంఘం చెందిన పలువురు ఉద్యోగులు ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. రవికుమార్ న్యావ వాది గుమస్తా నుంచి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అంచలంచలుగా ఎదగటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నాయకులు భూక్యా కోటేశ్వరరావు, అజ్మీరా కోటేశ్వరరావు, నరహరి చౌహాన్, లావుడ్యా రాందాస్, భూక్యారవిబాబు, రాజేష్‌కుమార్, చరణ్, జగన్, స్వామి, కన్సిలర్ తారా, మంగిలాల్ రవినాయక్ ప్రేమ్ చంద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తుమ్మల వ్యవసాయ క్షేత్రంలో..
పామాయిల్ గెలల కటింగ్ ప్రారంభం



తుమ్మలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

దమ్మపేట, ఏప్రిల్ 9: వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గండుగులపల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో తక్కువ కాలంలో వచ్చిన పామాయిల్ పంటను అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, తుమ్మల తనయుడు యుగంధర్ ఉగాది పండుగ సందర్భంగా మంగళవారం కొబ్బరికాయ కొట్టి పామాయిల్ గెలల కటింగ్ ప్రారంభించారు. రావాల్సిన సమయం కంటే ఎనిమిది నెలలు ముందుగానే పామాయిల్ గెలలు పంట వచ్చిందని ఆయిల్‌ఫెడ్ అశ్వారావుపేట డివిజనల్ మేనేజర్ బాలకృష్ణ తెలిపారు. పామాయిల్ దిగుబడి కూడా ఎక్కువ వచ్చే అవకాశం వుందన్నారు. కోస్టారికా దేశం నుంచి దిగుమతి చేసుకున్న తంబా హైబ్రీడ్ జాతికి చెందిన పామాయిల్ మొక్కలను వ్యవసాయ క్షేత్రంలో సాగు చేయటం జరిగిందని ఈ రకం మొక్కలు రైతులకు లక్ష మొక్కల వరకు పంపిణీ చేసినట్లు బాలకృష్ణ తెలిపారు. సేంద్రియ వ్యవసాయం చేయటంతో త్వరితగతిన పామాయిల్ గెలలు వచ్చినట్లు తుమ్మల తనయుడు యుగంధర్ తెలిపారు. పూర్తిగా సేంద్రియ పద్దతిలో పామాయిల్ సాగు చేసి అధిక దిగుబడులు వచ్చే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కొద్దిసేపు పామాయిల్ సాగు విధానంపై ఎమ్మెల్యే జారేతో తుమ్మల మాట్లాడారు. రైతులు సేంద్రియ వ్యవసాయం ద్వారా అధిక దిగుబడుల సాదించవచ్చన్నారు. కార్యక్రమంలో పామాయిల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రాంచంద్ర ప్రసాదు, దొడ్డా ప్రసాదు, కొయ్యల అచ్యుతరావు, కేవి సత్యనారాయణ, మన్నెం అప్పారావు, కాసాని నాగప్రసాదు, ఎర్రా వసంతరావు, సొసైటి చైర్మన్ ఎల్లిన రాఘవరావు, మురళి, దొడ్డా సత్యం, సాధు రమేష్‌రెడ్డి, చల్లగుళ్ళ నర్సింహారావు, తుమ్మల శేషుబాబు, తదితరులున్నారు.

మర్కోడులో వైభవంగా ఎల్లమ్మ బోనాలు

ఆళ్లపల్లి, ఏప్రిల్ 9: ఉగాది పర్వదినాన్ని పురష్కరించుకుని మంగళవారం ఆళ్లపల్లి మండల పరిధిలోని మర్కోడు గ్రామంలో గౌడ వంశీయుల ఆరాధ్య దైవమైన ఎల్లమ్మకు మహిళలు బోనాలు సమర్పించారు. పండుగ సందర్భంగా ఉదయాన్నే రజకులు ఇంటి ముందర మామిడి, వేపతోరనాలుతో గుమ్మాలను అలంకరించారు. మహిళలు ఒక్క పొద్దులతో ఇంట్లో బోనం వండి డప్పుచప్పుల్లతో శివశక్తుల పూనకాలతో ఎల్లమ్మ గుడికి చేరుకుని ఎల్లమ్మకు నైవేద్యం సమర్పించారు. గ్రామస్తులు చల్లంగా ఉండాలని, పాడి, పశుసంపద అభివృద్ధి చెందాలని వేడుకున్నారు. ఉగాది సందర్భంగా కొందరు రైతులు పంట పొలాల్లో ఎరువులు చల్లారు. గుడి దగ్గరకు వచ్చిన భక్తులకు దాహం తీర్చేందుకు కొంపల్లి సాంబయ్య తాగునీరు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు, గ్రామ పెద్దలు, గౌడవంశీయులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

ఇల్లెందుటౌన్ , ఏప్రిల్ 9: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో బాంబే కాలనీ మసీదులో మంగళశారం రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లీంలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాసి వీరభద్రయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మత సామరస్యతకు ప్రతీక రంజాన్ పండుగ అన్నారు. కులమతాలకతీతంగా అంతా కలసి ఈపండుగను నిర్వహించుకోవడం గర్వకారణమన్నారు. పేదవాడి ఆకలి విలువను ఈద్‌ఉల్ ఫితర్ అని 30 రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు చేసి నెలపొడుపు చూసిన అనంతరం రంజాన్ పండుగను ఎంతో భక్తి శ్రద్దలతో సోదరులు నిర్వహిస్తూ ఉంటారన్నారు. ప్రతి ఏటా కార్మిక సంఘం ఇఫ్తార్ విందును ఇవ్వడం అనవాయితీ వస్తోందని తెలిపారు. కార్యక్రమంలో పాలు పంచుకోవడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. టీబీజీకెఎస్ ఉపాధ్యక్షులు వూకంటి ప్రభాకర్ ఫోన్ ద్వారా ముస్లీంలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు షెక్ అబ్దుల్ రవూఫ్, కాపా శివాజీ, టి.శ్రీనివాస్, జంపయ్య, ఉపేందర్, హనుమంతరావు, రామారావు, కలగూర శంకర్, మజీద్ కమిటీ సదర్ ఎండీ హబీబ్, హుస్సేన్ ఖాన్, భరోసా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ఎండీ అమీనుద్దీన్, ముస్లీం మత పెద్దలు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్‌లో పాల్గొన్న ముస్లింలు

రేపు బీజేపీలోకి మనోహర్‌రావు

కొత్తగూడెం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఒకప్పుడు కీలక బీజేపీ నేతగా ఉన్న ప్రముఖ న్యాయవాది జీవీకే. మనోహర్‌రావు మాతృపార్టీ అయిన బీజేపీలోకి తిరిగి రంగ ప్రవేశం చేయనున్నారు. గత కొన్నేళ్లుగా బీజేపీ పార్టీని వదిలి బీఆర్‌ఎస్ పార్టీకి అనుబంధంగా కొనసాగారు. 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ పార్టీ తరపున పోటీచేసిన జలగం వెంకట్రావ్‌కు ప్రచారం చేసి ఆయన గెలుపునకు కృషి చేశారు. ఐదేళ్లుగా జలగం వెంటనే నడిచారు. ఆ తర్వాత మారిన రాజకీయ పరిణామాల దృష్ట్యా అటు బీఆర్‌ఎస్ పార్టీకి కానీ ఇటు బీజేపీ పార్టీకి దూరంగా ఉంటున్నారు. లోక్ సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మళ్లీ తన మాతృపార్టీ అయిన బీజేపీలోకి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. జీవీకే. మనోహర్ రావు బీజేపీ పార్టీలో తన రాజకీయ అరగ్రేటం చేశారు. రెండు సార్లు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు బీజేపీ పార్టీకి అధ్యక్షుడిగా కొనసాగారు.